సాక్షి నిజామాబాద్

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



మతోన్మాద శక్తులతో..

దేశానికి మతోన్మాద శక్తులతో ప్రమాదం పొంచి ఉందని సీపీఎం కార్యవర్గ సభ్యులు జ్యోతి, భాస్కర్ అన్నారు.

- IIలో ▸



ప్రైవేట్ వైపే మొగ్గు

సన్న రకం వడ్లకు ప్రభుత్వం బోనస్ ప్రకటించినా రైతులు వ్యాపారులకు అమ్ముకోవడానికే ఆసక్తి చూపుతున్నారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.5 /18.6

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నుడా పరిధి పెంపు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2017లో నిజామాబాద్ నగరం నుంచి 40 కిలోమీటర్ల మేర విస్తీర్ణంతో నుడా ఏర్పాటు చేశారు. దీని పరిధిలో 88 గ్రామాలు, 8 మండలాలు ఉండేవి. తాజాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం నుడా పరిధిని పెంచుతూ జీవో జారీ చేసింది. నుడా పరిధి ఇకపై జిల్లా మొత్తం కానుంది. ఇందులో 380 గ్రామాలను చేర్చింది. మున్సిపాలిటీలు భీమ్‌గల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలు కూడా దీని పరిధిలోకి వస్తాయి. నుడా పరిధి పెంపుపై చైర్మన్ కేశ వేణు హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్ సిటీ: ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు సరైన పత్రాలు సమర్పించి ప్లాట్లను రెగ్యులర్ చేసుకోవాలని నుడా చైర్మన్ కేశ వేణు సూచించారు. నుడా పరిధిలో 5,969 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. 4,511 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

సగం చేప పిల్లలే సరఫరా

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



బాల్కొండ : మత్స్యకారులకు ఉచితంగా సరఫరా చేసే చేపపిల్లల్లో ప్రభుత్వం కోత పెట్టిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం బాల్కొండ మండలం నాగాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎస్సారెస్పీలో 62 లక్షల చేప పిల్లలను వదిలే వారన్నారు. ప్రస్తుతం 31 లక్షల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేశారన్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుత సంవత్సరం రొయ్యల సీడ్‌ను వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 4.72 కోట్ల చేప పిల్లలను వదలగా ప్రస్తుతం సగం కూడా వదిలే పరిస్థితి లేదన్నారు. చేపపిల్లల్లో కోత విధించి మత్స్యకారుల పొట్ట కొట్టవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు సెలవులు

సుభాష్‌నగర్ : నగరంలోని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు దీపావళి పండుగ పురస్కరించుకుని సెలవులు ప్రకటించినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ మర్చంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు శ్రద్ధానంద్ గంజ్‌లో ఈనెల 28 నుంచి నవంబర్ 3 వరకు వ్యాపార లావాదేవీలు జరపడం లేదని పేర్కొన్నారు. పైన తెలిపిన తేదీల్లో రైతులు మార్కెట్ యార్డుకు సరుకులు తీసుకురావద్దని సూచించారు. తిరిగి 4వ తేదీ నుంచి వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తీసుకోవాలి


ఖలీల్‌వాడి: దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేవారు పోలీస్ డివిజనల్ అధికారి(ఏసీపీ) కార్యాలయం నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అనుమతి లేకుండా దుకాణాలు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో దుకణాలు పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఆయా దుకాణాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

స్కానింగ్ యంత్రాల సీజ్

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో మళ్లీ లింగ నిర్ధారణ పరీక్షల వ్యవహారం కలకలం రేపింది. శుక్రవారం అర్ధరాత్రి ఓ ఆస్పత్రి నుంచి స్కానింగ్ మిషన్‌ను కారులో వేరే ప్రాంతానికి తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో అశోక్‌నగర్ కాలనీ రైల్వే గేటు వద్ద కారును తనిఖీ చేయగా.. స్కానింగ్ యంత్రం కనిపించింది. జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ చేరుకుని కారు డ్రైవర్ దేవని పృథ్వితోపాటు మరో వ్యక్తి సిద్దిరాములును విచారించారు. శ్రీరాంనగర్ కాలనీలో గతంలో సీజ్ చేసిన ఆస్పత్రి పక్కనే ఉన్న భవనంలో లింగనిర్ధారణకు వినియోగించిన మరో స్కానింగ్ యంత్రం ఉందని వారు చెప్పడంతో అధికారులు అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

యుగపురుషుడు

- హైందవ శంఖారావంగా నిలిచిన కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్
- రెంజల్ మండలం కందకుర్తిలో ఆయన వంశ మూలాలు
- కందకుర్తి మట్టిని తాకేందుకు యేటా అనేకమంది రాక
- కందకుర్తిని సందర్శించిన ప్రతి సర్‌సంఘ్‌చాలక్
- హెడ్గేవార్ వంశంలో పుట్టడం గర్వకారణం
- హెడ్గేవార్ వంశస్తుడు దిలీప్ శాస్త్రితో 'సాక్షి' ఇంటర్వ్యూ



నాటి శ్రీ క్షేత్రంగా వర్ధిల్లిన నేటి కందకుర్తి మూలాలు కలిగిన ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్ యుగపురుషుడని ఆయన వంశస్తుడు దిలీప్‌శాస్త్రి హెడ్గేవార్ అన్నారు. ప్రస్తుతం ఈ ప్రపంచంలో హెడ్గేవార్ వంశానికి చెందిన ఒకే ఒక్క కుటుంబం ఇందూరులో నివసిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100వ సంవత్సరం నడుస్తున్న నేపథ్యంలో సదరు కుటుంబానికి చెందిన దిలీప్ శాస్త్రి హెడ్గేవార్‌తో 'సాక్షి' ముఖాముఖి ఆయన మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



దిలీప్ శాస్త్రి హెడ్గేవార్

■ మా వంశానికి మూల పురుషుడు వల్లభేష్. దత్తాత్రేయ స్వామి అంశతో ఆయన జన్మించినట్లు మా తాతముత్తాతలు చెప్పేవారు. కందకుర్తి అప్పట్లో శ్రీ క్షేత్రంగా వర్ధిల్లింది. అప్పట్లో నృసింహ సరస్వతి స్వామి (గాణుగాపూర్-కర్ణాటక) కందకుర్తిలో మా వంశీయుల ఇంటికి వచ్చి భోజనం చేసినట్లు చరిత్ర చెబుతోంది. ఇదే క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించిన కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్ దత్తాంశతో జన్మించినట్లు మా తాతలు చెప్పారు. అనేక మంది దీన్ని విశ్వసిస్తున్నారు. దీంతో కాషాయ జెండాను మాత్రమే గురువుగా ఉంచి ఆర్‌ఎస్‌ఎస్‌కు పురుడు పోశారు. తద్వారా హైందవ శంఖారావంగా నిలిచారు. దీంతో కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్ యుగపురుషుడుగా వర్ధిల్లుతున్నారు.

■ హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా కేబీ హెడ్గేవార్ పరితపించేవారు. 1889 ఏప్రిల్ 1న ఉగాది రోజున నాగ్‌పూర్‌లో జన్మించిన హెడ్గేవార్ డాక్టరు విద్యనభ్యసించి నాగ్‌పూర్‌లో వైద్యసేవలు అందించారు. 1920లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విధానాలు నచ్చక 1923లో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారు. భారత స్వయంసేవక్ మండల్‌లో పనిచేశారు. 1925లో ఈ సంస్థ నుంచి బయటకు వచ్చి విజయదశమి రోజున ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారు. ఆర్‌ఎస్‌ఎస్ నేడు ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండడం గర్వంగా ఉంది.

■ వంశవృక్షానికి సంబంధించి చూస్తే కేబీ హెడ్గేవార్ తాతగారు నాగ్‌పూర్‌కు వలస వెళ్లినప్పటికీ మా మరో ముత్తాతగారైన శ్రీరామశాస్త్రి హెడ్గేవార్ కందకుర్తిలోనే ఉంటూ వచ్చారు. ఆయన కుమారుడు బాపు శాస్త్రి హెడ్గేవార్ పిల్లలకు వేదాలు నేర్పించేవారు. ఆయన కుమారుడు వెంకటేష్ శాస్త్రి హెడ్గేవార్ మాత్రం అప్పటి సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి పిలుపు మేరకు ఇందూరుకు న్యాయాధికారిగా వచ్చారు. వెంకటేష్ శాస్త్రి కుమారుడైన మా తండ్రిగారు శ్రీరాంశాస్త్రి ఆర్మీలో పనిచేశారు. తరువాత ఇందూరు కోర్టులో పనిచేశారు. తెలుగు, మరాఠీ, హిందీ, ఆంగ్లం, ఉర్దూ తెలిసిన ఈయన ఇందూరులో టైప్ ఇన్‌స్టిట్యూట్ పెట్టి తర్జుమా చేసే సేవలు అందించారు.

■ ప్రస్తుతం కందకుర్తిలో మా ఇంటిని కేబీ హెడ్గేవార్ స్మృతి మందిరం ఏర్పాటు చేసేందుకు ఇచ్చాం. హెడ్గేవార్‌జీ మూలాలు తెలంగాణ రాష్ట్రానివి కావడం గర్వకారణం. కందకుర్తి మట్టిని తాకేందుకు అనేకమంది వస్తుండడం, ఇందులో ప్రతి సర్‌సంఘ్‌చాలక్ ఉండడం గర్వకారణంగా భావించాలి. ధర్మాబాద్ రైల్వే స్టేషన్‌కు కేబీ హెడ్గేవార్ పేరును పెట్టాలనే డిమాండ్లు ఉన్నాయి.



కందకుర్తిలో హెడ్గేవార్ వంశీయుల పాత ఇల్లు

కందకుర్తికి పలుమార్లు..

నాగ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించినప్పటికీ హెడ్గేవార్ అనేక సార్లు కందకుర్తికి వచ్చారు. కేబీ హెడ్గేవార్‌కు కందకుర్తి మూలాలు ఉండడంతో ప్రస్తుతం అనేకమంది ఇక్కడి మట్టిని తాకేందుకు వస్తున్నారు. పురాణాల్లో గరుత్మంతుడి మాదిరిగా భరతమాతను సమున్నత స్థాయిలో ఉంచే లక్ష్యంతో సంఘ్‌ను నెలకొల్పారు. 1930లో బ్రిటిష్ చట్టాలను ఉల్లంఘించారు. నిరాహారదీక్ష చేసి 9 నెలలు కారాగారంలో ఉన్నారు. జైల్లో ఉండి కూడా సంఘ్ కార్యకలాపాల విస్తరణ కోసం కృషి చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం బలమైన పునాదులు వేశారు. త్రివేణి సంగమమైన కందకుర్తి మూలాల నుంచి భారతజాతిని సంఘటితం చేసేందుకు తిరుగులేని కృషి చేశారు. 1940 జూన్ 21న మరణించారు.

ఖాకీలపై చర్యలుంటాయా?

- ఐజీకి చేరిన 'ఇసుక మామూళ్ల' పోలీసుల జాబితా!
- రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయిన సాక్షి కథనం

ఖలీల్‌వాడి: ఇసుకాసురులకు అండగా నిలిచిన పోలీసుల జాబితా ఐజీకి చేరింది. దీంతో వారిపై చర్యలుంటాయా అని చర్చ జరుగుతోంది. జిల్లాలో కొందరు ఎస్సైలు, సీఐలు ఇసుక అక్రమ రవాణాకు సహకరించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీ నుంచి సీపీ ఆఫీస్‌కు ఉత్తర్వులు వచ్చిన విషయం తెలిసిందే. అక్రమాలకు పాల్పడుతున్న పోలీసుల జాబితాను పంపి లూప్‌లైన్‌కు పంపాలని సూచించారు. వారు ప్రతినెల తీసుకుంటున్న మామూళ్ల లెక్కలను సైతం అందులో పేర్కొన్నారు. అయితే సెప్టెంబర్ 4న ఉత్తర్వులు వచ్చినా వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ ఉత్తర్వులు రాకముందే జిల్లాలో పోలీసుల బదిలీలు జరిగాయి. ఇందులో కొందరు ఎస్సైలు ఇదే జిల్లాలో బదిలీ కాగా మరి కొంతమంది నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లారు. అయితే ఇసుక దందాలో చేతివాటం ప్రదర్శించిన ఎస్సైలు, సీఐలకు సంబంధించిన జాబితాను జిల్లా పోలీస్ సిబ్బంది ఐజీకి పంపించినట్లు చర్చ జరుగుతోంది. జిల్లాలో ఎస్సైల సంఖ్య తక్కువగా ఉండటంతో వారిపై చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. డీజీపీ ఇచ్చిన ఉత్తర్వులలో స్పష్టంగా ఎస్సైలు, సీఐలు ఎంత వాటా తీసుకుంటున్నారనేది స్పష్టంగా ఉన్న చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. టాస్క్‌ఫోర్స్‌లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్ల, ఏసీపీని సస్పెండ్ చేసిన అధికారులు వీరిపై చర్యలు తీసుకోకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



ఇసుక ఉన్న చోట పోస్టింగ్

అక్రమ ఇసుక రవాణాకు సహకరిస్తున్న పోలీసులు ఇటీవల జరిగిన బదిలీల్లో మళ్లీ ఇసుక ఎక్కువగా దొరికే ప్రాంతాల్లో పోస్టింగ్ పొందారు. కోటగిరి ఎస్సై సందీప్, రుద్రూర్ ఎస్సై కృష్ణ, ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్, జక్రాన్‌పల్లి ఎస్సైలు బదిలీలు కాకుండా యథావిధంగా కొనసాగుతున్నారు. రెంజల్‌లో ఎస్సైగా పని చేసిన సాయన్న రుద్రూర్‌కు, ధర్పల్లి ఎస్సైగా ఉన్న విక్రం మోర్తాడ్‌కు, బోధన్‌రూరల్ ఎస్సైగా ఉన్న నాగనాథ్ వేల్పూర్‌కు, మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు, రుద్రూర్ ఎస్సై అప్పారావులు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. రమేశ్ జిల్లాలోనే పోస్టింగ్ తీసుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సైలకు మంజీర, పెద్దవాగు ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం.

'సాక్షి' కథనంపై చర్చ

ఇసుకాసురులకు సహకరిస్తున్న పోలీసులపై ఈ నెల 24న 'ఇసుక దందాకు ఖాకీల అండ!' శీర్షికన సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని పోలీస్ వాట్సాప్ గ్రూప్‌లలో ఈ కథనం వైరల్‌గా మారింది. దీంతో ఉన్నతాధికారుల వద్దకు సాక్షి కథనం వెళ్లడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు సమాచారం.

పుష్కరఘాట్‌కు అహల్యబాయ్ హోల్కర్ పేరు



కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర ఘాట్లపై శుభ్రం చేస్తున్న స్వయం సేవకులు

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలోని ఘాట్‌కు రాణి అహల్యబాయి హోల్కర్‌గా శనివారం నామకరణం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు ఘాట్లలో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. సామాజిక సమరసత వేదిక తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతు.. రాణి అహల్యబాయి 300 జయంతిని పురస్కరించుకుని ఘాట్‌కు నామకరణం చేసినట్లు వివరించారు. నదిలోని పురాతన శివాలయాన్ని అహల్యబాయి 250 ఏళ్ల క్రితం నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పుష్కరక్షేత్రంలో పూజ్య ధర్మాచార్యుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్త సృజన్, గంగ నర్సయ్య, గోవింద్, కిశోర్, సతీష్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నిజామాబాద్‌అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈ నెల 29న నిజామాబాద్‌కు రానుంది. ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. బీసీ కమిషన్ పర్యటనను పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న నిజామాబాద్ కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతత్వంలోని స్థానిక సంస్థలలో రిజర్వేషన్లపై అభిప్రాయాలు సేకరిస్తుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిజామాబాద్ జిల్లా వారు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కామారెడ్డి జిల్లా వారు రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను అందించాలని సూచించారు. కీలకమైన అంశంపై కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్న దృష్ట్యా ఎక్కడ కూడా అవాంతరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. అభిప్రాయాలను నివేదించేందుకు హాజరయ్యే వారికి సహకరించేందుకు వీలుగా రెండు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం వినతి పత్రాలతో కూడిన పూర్తి వివరాలు, వీడియోలు, ఫొటోలు కమిషన్‌కు సమర్పించాల్సి ఉన్నందున అన్నింటినీ జాగ్రత్తగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ఇబ్బంది లేకుండా అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దృష్టికి కానిస్టేబుళ్ల సమస్యలు

- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌ను శనివారం జిల్లా ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధుశర్మ సందర్శించారు. కానిస్టేబుళ్లను, ఇతర సిబ్బందిని పిలిపించుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఏదైనా సమస్యలుంటే తమకు చెప్పాలని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం పేరిట రోడ్లపైకి రావొద్దన్నారు. రెండు రోజుల క్రితం ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ కానిస్టుబుళ్ల కుటుంబ సభ్యులు రాస్తారోకో నిర్వహించిన విషయం తెలిసిందే. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేష్, అసిస్టెంట్ కమాండెంట్లు ఉన్నారు.

బైక్ ర్యాలీ రద్దు

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం బెటాలియన్ పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు సివిల్ పోలీసులకు సమాచారం అందజేశారు. అయితే వరంగల్ 4వ బెటాలియన్, నల్గొండ 12వ బెటాలియన్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు సమాచారం రావడంతో ఇన్‌చార్జి కమాండెంట్ సురేష్ అప్రమత్తమయ్యారు. వెంటనే బైక్‌ర్యాలీని రద్దు చేశారు. అనంతరం ర్యాలీకి బదులుగా బెటాలియన్ ఆవరణలోని అమర పోలీసుల స్థూపం వద్ద మౌనం పాటించి నివాళులర్పించారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా కొనసాగిస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల స్థితిగతులపై రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, రవాణా శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన నిఘా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఉమ్మడి తనిఖీ కేంద్రాల వద్ద ఏవైనా సదుపాయాలు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహారాష్ట్రకు అనుకుని ఉన్న జిల్లాలోని సాలూరా, కందకుర్తి, పోతంగల్, ఖండ్‌గాం ప్రాంతాలలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఇబ్బందులు కలగకుండా సేవలందించాలి

- డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోకి రావొద్దు
- లైసెన్స్ లేకుండా స్టాంపులు విక్రయిస్తే చర్యలు
- రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రమేశ్‌రెడ్డి



కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఐజీ రమేశ్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: రిజిస్ట్రేషన్లకోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని రిజిస్ట్రేషన్ శాఖ నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) రమేశ్‌రెడ్డి ఆదేశించారు. పాత రాజంపేట వద్ద గల కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ సాయికృష్ణతో మాట్లాడి రిజిస్ట్రేషన్‌లు, స్టాంపుల విక్రయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఇక్కడ సమస్యలున్నాయా.. సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారా.. డబ్బులు ఏమైనా అడుగుతున్నారా? అని కార్యాలయానికి వచ్చిన వారిని అడిగారు. అయితే వారంతా డాక్యుమెంట్ రైటర్లు అని తెలవడంతో సబ్‌రిజిస్ట్రార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్యు మెంట్ రైటర్లు, ప్రైవేట్ వ్యక్తులకు కార్యాలయంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. వారిని కార్యాలయం లోనికి రానివ్వవద్దని సబ్ రిజిస్ట్రార్‌కు సూ చించారు. ప్రజలు నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో స్టాంపు పేపర్లు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఎవరు పడితే వారు స్టాంప్ పేపర్లు విక్రయించడానికి వీలులేదన్నారు. అలాగే వాటిపై అదనపు రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి ఇచ్చి న చోట కాకుండా, లైసెన్స్ లేకుండా స్టాంపులు వి క్రయిస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో కనిపించే అడ్రసుల వద్దే స్టాంపులు విక్రయించాలన్నారు. ఫ్రాంకింగ్ మిషిన్‌లో ఇంక్ లేక సేవలు నిలిచిపోయిన విషయమై 'సాక్షి'లో ఈనెల 22న ప్రచురితమైన కథనంపైనా ఆయన స్పందించారు. ఇకపై కార్యాలయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని పేర్కొన్నారు.



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో..

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన పీసీసీ చీఫ్

నిజామాబాద్ సిటీ: పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని వేర్వేరుగా కలిశారు. ఖర్గే పదవీ కాలం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాలనుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి 12,754 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5,800 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 150, వరద కాలువ ద్వారా 5 వేలు, ఆవిరి రూపంలో 571 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో(మహిళా ప్రాంగణం) నర్సింగ్ మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ ఫీమేల్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా అధికారిణి పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ఉచిత శిక్షణ కోసం ఇంటర్ ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థినులు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ పేరుపై రూ.200 డీడీ చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన పత్రాలను మహిళ ప్రాంగణంలో అందించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 83094 63939, 94403 55435, 83329 49550, 87902 00180, 87909 40461 నంబర్లను సంప్రదించాలన్నారు.

తెయూ వీసీకి సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ టీ యాదగిరిరావును వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీని ఘనంగా సన్మానించి వర్సిటీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, తెలంగాణ విద్యార్థి వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

'మార్పు' శిక్షణలో టీచర్లు



నిజామాబాద్‌అర్బన్: పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ఏర్పాటు, డ్రగ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 'మార్పు' శిక్షణ కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్‌తోపాటు పలు మండలాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. నాట్కో డైరెక్టర్ సందీప్ సుల్తానియా చేతుల మీదుగా జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, ఎంఈవోలు జీవన్, సాయిరెడ్డి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గంగాధర్ తదితరులు ధ్రువీకరణపత్రాలు అందుకున్నారు.

రాష్ట్రపతి నిలయం సందర్శన



నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయాన్ని గిరిరాజ్ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ఎన్ఎస్ఎస్, యువ టూరిజం ఆధ్వర్యంలో యాత్ర చేపట్టారు. నాలెడ్జిపార్క్, సెంట్రల్ బిల్డింగ్, కిచెన్, టన్నెల్, హెర్బల్ పార్క్, రాక్ గార్డెన్‌ను సందర్శించారు.

ప్రైవేట్ వైపే మొగ్గు

- సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించినా ఆసక్తి చూపని రైతులు
- వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వ్యాపారులకే విక్రయం
- క్వింటాల్‌కు రూ.2,350 వరకు చెల్లిస్తున్న వ్యాపారులు



పంట పొలంలోనే ధాన్యాన్ని తూకం వేసి సంచుల్లో నింపుతున్న కూలీలు

మోర్తాడ్(బాల్కొండ): సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 చొప్పున బోనస్‌ను ప్రకటించినా రైతులు మాత్రం వ్యాపారులకే పంట దిగుబడిని విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయాలంటే తేమ శాతం 17 వరకే ఉండాలి. అంతకు మించి ఎక్కువ తేమ ఉంటే ధాన్యాన్ని ఆరబెట్టాల్సి ఉంటుంది. వాతావరణం అనుకూలంగా లేని ప్రస్తుత పరిస్థితుల్లో ధాన్యాన్ని ఆరబెట్టడంకన్నా పచ్చిగా ఉన్నప్పుడే విక్రయించడం మేలని రైతులు భావిస్తున్నారు. పంట కోత ఇలా పూర్తవుతుందో లేదో పచ్చి ధాన్యాన్ని వ్యాపారులు కల్లాల నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.2,350 వరకు ధర చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే ధాన్యానికి మద్దతు ధర రూ.2,300 ఉండటంతోపాటు బోనస్ కలుపుకుని రూ.2,800 వరకు రైతులకు అందనుంది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ధాన్యం సొమ్ము ఎప్పుడు జమ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యాపారులకు విక్రయిస్తే పది, పదిహేను రోజుల వ్యవధిలో ధాన్యం సొమ్ము చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. నమ్మకమైన వ్యాపారులకే రైతులు వరిని తూకం వేసి ఇస్తున్నారు. ధాన్యాన్ని ఆరబోయకుండా విక్రయిస్తే ఎక్కువ బరువు లభించి తమకు నష్టం లేకుండా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. బోనస్ సొమ్ము లబ్ధి చేకూరకపోయినా ధాన్యాన్ని ఆరబోయాల్సిన అవసరం లేకుండా పోతోందని రైతులు పేర్కొంటున్నారు. హమాలీ చార్జీలు సైతం కలిసి వస్తున్నాయని, కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలిస్తే రవాణా భారం తమపైనే పడుతుందని రైతులు చెబుతున్నారు. వివిధ రకాలైన కారణాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యాన్ని వ్యాపారులకే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీమ్‌గల్, ఏర్గట్ల, మెండోరా, బాల్కొండ, ముప్కాల్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, నందిపేట్ తదితర మండలాల నుంచి ధాన్యం తరలిపోతోంది. రోజు 50 నుంచి 100 లారీల ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు, స్టాకిస్టులు కొనుగోలు చేసుకుని తరలిస్తున్నారు.

నిబంధనలు కఠినంగా ఉన్నాయి



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే నిబంధనలు కఠినంగా ఉన్నాయి. వ్యాపారులు ధాన్యాన్ని ఆరబోయకున్నా అలాగే తూకం వేసి తరలించుకుంటున్నారు. నమ్మకం ఉన్న వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నాం. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే ఎప్పుడు డబ్బులు జమ చేస్తారో స్పష్టత లేదు.

– మాదం నర్సయ్య, రైతు, తొర్తి

కల్లాల్లోనే కాంటా

- పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- సన్న రకానికి ఫుల్ డిమాండ్

బాల్కొండ: వరి కోతలు జోరందుకున్న ప్రస్తుత తరుణంలో ప్రైవేట్ వ్యాపారులు కల్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. సన్న రకానికి చాలా డిమాండ్ ఉంది. తేమ శాతంతో సంబంధం లేకుండా క్వింటాల్‌కు రూ.2,300 నుంచి రూ.2,350 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబోసే పనిలేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. బాయిల్డ్ రైస్ కోసం రైస్ మిల్లర్లు పచ్చి ధాన్యాన్నే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అమన్ సూపర్, బీపీటీ రకాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.



ముప్కాల్ మండలంలో పచ్చి ధాన్యాన్ని కాంటా చేస్తున్న కూలీలు

ఎకరానికి 25క్వింటాళ్లపైనే దిగుబడి..

ప్రస్తుత సంవత్సరం సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లో నీరు నిండడంతో పంటల సాగుకుఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. దీంతో ప్రస్తుత సంవత్సరం ధాన్యం దిగుబడికి ఢోకా లేకుండా పోయింది. సన్న రకం ఎకరానికి 25 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. కొన్ని రకాల ధాన్యం ఇంతకంటే ఎక్కువగానే దిగుబడి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చి వాటికే ధర వస్తోంది



వడ్లు పచ్చివే వ్యాపారులు కొంటున్నారు. క్వింటాల్‌కు రూ.2,300 పెడుతున్నారు. దీంతో పచ్చివే అమ్ముకుంటున్నాం. పంట దిగుబడి కూడా బాగానే వస్తుంది. కొనుగోలు కేంద్రాల కంటే ఇక్కడ అమ్ముకోవడమే మంచిగా ఉంది.

– ముత్యంరెడ్డి, రైతు

రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు



తెయూలో కబడ్డీ సెలక్షన్స్..

రాజంపేట: మండలంలోని తలమడ్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆర్ గిల్షన్ ఎస్‌జీఎఫ్ అండర్ – 17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా రంగా శ్రీనిధి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దొమ్మాటి భిక్షపతి తెలిపారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు గోదావరిఖనిలో, కబడ్డీ పోటీలు నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు గిల్షన్, శ్రీనిధితోపాటు వ్యాయాయ ఉపాధ్యాయుడు బాలయ్యను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు భగత్, చక్రపాణి, దయాకర్, ఆంజనేయులు, జి నారాయణ, ప్రభాకర్, ఎస్ నారాయణ, వనిద్ర, నర్సింహారెడ్డి, అనిత, నర్సింలు, రజిత అభినందించారు.

వర్సిటీ ఇంటర్ కాలేజీ (మెన్స్) కబడ్డీ జట్టు..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ కబడ్డీ (మెన్) సెలెక్షన్స్ శనివారం క్యాంపస్ క్రీడా మైదానంలో నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి సుమారు 50 మందికిపైగా విద్యార్థులు ఎంపిక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, పీఆర్వో పున్నయ్య, చీఫ్ వార్డెన్ మహేందర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ, క్రీడానైపుణ్యం కలిగిన 16 మంది ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ డైరెక్టర్ జి బాలకిషన్ తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 29 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నీలో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఎంపిక పోటీల్లో ఫిజికల్ డైరెక్టర్లు బాలమణి, కుమారస్వామి, ప్రశాంత్, బుచ్చన్న, వివిధ కళాశాలల ఇన్‌చార్జీలు, క్రీడాకారులు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఆర్ నేత తెలిపారు.

మతోన్మాద శక్తులతో ప్రమాదం పొంచి ఉంది



మహాసభలో మాట్లాడుతున్న నాయకురాలు జ్యోతి



మహాసభలో పాల్గొన్న కార్మికులు

నిజామాబాద్ సిటీ: మన దేశానికి మతోన్మాద శక్తులతో ప్రమాదం పొంచి ఉందని, పాలకులు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కులమతాల మధ్య చిచ్చుపెట్టడంలో ముందుంటున్నారని సీపీఎం కార్యవర్గ సభ్యులు జ్యోతి, పాలడుగు భాస్కర్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం సీపీఎం 28వ జిల్లా మహాసభలు నిర్వహించారు. కార్మికులతో మున్సిపల్ కార్యాలయం నుంచి ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం లేదని విమర్శించారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలను రెండో తరగతి వ్యక్తులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ఎంపీ అరవింద్ పసుపు బోర్డు తెస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చకుండా కల్లిబొల్లి మాటలు చెప్పి రైతాంగాన్ని ఏమారుస్తున్నారన్నారు.కార్యక్రమంలో నాయకులు జ్యోతి, పాలడుగు భాస్కర్, రమ, రమేశ్‌బాబు, పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేశ్, శంకర్, సుజాత, కొండ గంగాధర్, జంగం గంగాధర్, భాస్కర్, రమేశ్, పెద్ది వెంకట్రాములు, రమేశ్‌బాబు, నూర్జహాన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

బైక్ అదుపుతప్పిన ఘటనలో గాయపడిన వ్యక్తి..

మాక్లూర్ : బైక్ అదుపు తప్పిన ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 20న ఎడపల్లి మండలం జానకంపేట గ్రామానికి చెందిన సయ్యద్ ఫిరోజ్, సయ్యద్ మౌలానా బైక్ వెళ్తుండగా రామచంద్రాపల్లి శివారులో అదుపుతప్పింది. ఈ ఘటనలో సయ్యద్ మౌలానా తలకు బలమైన గాయాలుకాగా, ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య సలీమా బీ ఫిర్యాదు మేరకు బైక్ నడిపిన సయ్యద్ ఫిరోజ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బట్టలు ఉతికేందుకు వెళ్లి వృద్ధురాలు..

మాక్లూర్ : బట్టలు ఉతికేందుకు చెరువుకు వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కల్లెడిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మోతె గంగుబాయి (90) బట్టలు ఉతికేందుకు శుక్రవారం సాయంత్రం చెరువుకు వెళ్లి నీటిలో పడిపోయింది. శనివారం ఉదయం గంగుబాయి మృతదేహం నీటిలో తేలింది. మృతురాలి కుమారుడు మోతె భోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ..



మహిళ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీక్లీ మార్కెట్‌లోని కల్లుబట్టి వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతురాలి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందన్నారు. మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 59837 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మృతి చెందిన మహిళతోపాటు మరో వ్యక్తి కల్లుబట్టీలో మద్యం, కల్లు సేవించినట్లు అక్కడి వారు చెబుతున్నారు. మహిళ కింద పడిపోగానే సదరు వ్యక్తి అక్కడి నుంచి జారుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

స్కార్పియో బోల్తా

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామ శివారులో సంగారెడ్డి – నాందెడ్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి స్కార్పియో బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి పిట్లం మండలానికి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.



వాహనంలో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

భిక్కనూరు: అప్పుల తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన తాళ్లపల్లి నర్సయ్య (53) తన కుమారుడు, కుమార్తె పెళ్లికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 17వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన 18 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 24న ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లోకి చొరబడి చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లోని ఓ ఇంట్లోకి చొరబడిన దుండగుడు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

నర్సుబాయి(70) అనే మహిళ శనివారం తన ఇంట్లో ఉండగా, ఇంట్లోకి చొరబడిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లిలో శనివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సాయన్న చెప్పారు. పక్కా సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.6,130 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ చోరీ.. ముగ్గురిపై కేసు

నిజామాబాద్‌రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖానాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద పార్క్‌చేసి ఉన్న లారీని దుండగులు ఎత్తుకెళ్లారని రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని లలితానగర్‌కు చెందిన గోనె శ్రీనివాస్ తన లారీని ఈనెల 23వ తేదీన ఖానాపూర్ ఎక్స్ రోడ్డులో పార్క్ చేశాడు. మరుసటి రోజు తెల్లవారుజామున వెళ్లి చూసే సరికి లారీ కనిపించకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆర్మూర్‌ప్రాంతంలో లారీ ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొండ గొర్రెను వేటాడిన వ్యక్తిపై..

గాంధారి(ఎల్లారెడ్డి): కొండ గొర్రెను వేటాడిన వ్యక్తిపై అటవీచట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో హిమచందన శనివారం తెలిపారు. మండలంలోని రాంపూర్‌గడ్డ తండాకు చెందిన హన్మంతు రెండు రోజుల క్రితం ముదెల్లి అటవీ ప్రాంతంలో కొండగొర్రెను వేటాడి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి విక్రయించాడు. ఈ ఘటనపై కామారెడ్డి ఎఫ్‌డీవో రామకృష్ణ విచారణ చేపట్టి హన్మంతుపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. హన్మంతు పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుని రిమాండ్ చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

- బైక్‌ను ఢీ కొట్టిన కారు

బాల్కొండ: మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 44పై బైక్‌ను కారు వెనుక నుంచి అతి వేగంగా ఢీ కొట్టడంతో మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన రాజానందం(55) అక్కడిక్కడే మృతిచెందగా, అతడి భార్య సిద్ధవ్వకు గాయాలయ్యాయి. బాల్కొండ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాజానందం తన భార్యతో కలిసి బైక్‌పై బాల్కొండ మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా దూసుకువచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజానందం తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన అతడి భార్య సిద్ధవ్వను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రాజానందం (ఫైల్)

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్‌లో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాకాసీపేట్‌లోని జీనత్ ఫంక్షన్ హాలులో పెళ్లి రిసెప్షన్ జరుగుతుండగా సాయికుమార్ అనే వ్యక్తి ఆహ్వానం లేకుండాని ఫంక్షన్ హాలులోకి వెళ్లి సెల్‌ఫోన్‌తో ఫొటోలు, వీడియో తీస్తుండగా అక్కడే క్యాటరింగ్ చేస్తున్న వ్యక్తి వారించాడు. దీంతో సాయికుమార్ గొడవకు దిగి తన చేతికి ఉన్న కడియంతో ఖలీల్ ముఖంపై కొట్టాడు. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు ఫంక్షన్ హాల్‌కు చేరుకొని సాయికుమార్‌ను సముదాయిస్తుండగా దురుసుగా వ్యవహరించి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. ఫంక్షన్ హాలులో గొడవ చేయడంతోపాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేధింపులకు పాల్పడిన వారిపై..

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన శ్యామల అనే మహిళను వేధిస్తున్న అత్తామామలపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. తన భర్త మృతి చెందడంతో అత్తామామలు వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు.